క్లుప్తంగా

చదువుతోనే సంపూర్ణ జ్ఞానం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



విద్యార్థినులతో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే జ్ఞానం లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ కేజీబీవీలో గత ఏడాది పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థినులను గురువారం సన్మానించారు. అలాగే విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు కీసరి పాపయ్య, డీసీసీబీ డైరెక్టర్ రామచంద్రం, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, పాఠశాల ఎస్‌ఓ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతం మారిన వారు రావాలి

తొగుట(దుబ్బాక): మతం మారినవారు తిరిగి హిందూమతంలోకి రావాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయ అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని తుక్కాపూర్‌లో గురువారం దీక్షా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ మతంలోకి మారిన 105 మందిని తిరిగి హిందూ మతంలోకి తీసుకొచ్చామన్నారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వీరబ్రహ్మంగారు, కంచర్ల గోపన్న వంటి మహానుభావులు జన్మించిన పుణ్యభూమి అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మాల సత్యం, వీహెచ్‌పీ నేతలు వెంకటేష్ జాతవ్, గ్యాదరి రాజారాం, ప్రభాకర్ రెడ్డి, నరసిహమూర్తి, బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం పాల్గొన్నారు.

మద్దతు ధర పెంపు హర్షణీయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర పెంచడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి గురువారం అన్నారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 14 పంటలకు కనీస మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచడంపై రైతులు స్వాగతిస్తున్నారన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం

సిద్దిపేటకమాన్: దళారీ, పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మించాలని సీపీఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ దండకారణ్యంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను దోచుకెళ్లేందుకే ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై దాడులు చేస్తున్నారన్నారు. సమావేశంలో నర్సింహులు, లెనిన్, పద్మ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గతేడాది తిగుల్ గ్రామంలో చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గురువారం తిగుల్‌లో మృతుల కుటుంబాలను కలిసి ప్రభుత్వం పరిహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ప్రభుత్వం మూడు కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, నాయకులు కల్పన, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెరుగుతుంది

కొండపాక(గజ్వేల్): సేంద్రీయ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుందని గజ్వేల్ డివిజన్ ఏడీఏ బాబూనాయక్ అన్నారు. మండలంలోని వెలికట్టలో జీలుగ, పచ్చిరొట్ట సాగును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై జలుగ విత్తనాలను అందజేస్తుందన్నారు.

ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలోని గిరిజన గురుకుల విద్యార్థులతో గురువారం గడ్డి తొలగించే పనులు చేయించిన ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి నాయకుడు సత్యం నాయక్ డిమాండ్ చేశాడు. చదువుకోవడానికి పాఠశాలకు వస్తే విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌సీఓ వెంకన్నకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

గజ్వేల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు మార్గంలోని రెయిన్ బో కంప్యూటర్స్ పక్క వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, కాలనీవాసులు ఉమ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాటు సరే.. వసతులేవి?

పాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన మండలంలో ప్రభుత్వ కార్యాలయాలను ప్రైవేటు, దేవస్థానం వసతి గదుల్లో ఏర్పాటు చేశారు. దీంతో అటు భక్తులు, ఇటు ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. ప్రైవేటు భవనాలకు రూ.లక్షల్లో కిరాయి చెల్లిస్తున్నారు. కాగా భవనాల నిర్మాణానికి ఎంపీపీ ప్రతిపాదనలు రూపొందించి అధికారులకు పంపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఎదురు చూస్తున్నారు.

- 2016లో ఏర్పడిన కొమురవెల్లి మండలం
- ప్రైవేటు భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్
- దాతల స్థలం ఇస్తే నిర్మిస్తామన్న అధికారులు



ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న కొమురవెల్లి తహసీల్దార్ కార్యాలయం

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే 2016 సంవత్సరంలో కొమురవెల్లిని నూతన మండలంగా చేశారు. కాగా తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, మహిళా భవనాలను ప్రైవేటు భవనాల్లో, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాన్ని కొమురవెల్లి మల్లికార్జునస్వామి వసతి గదుల్లో కొనసాగిస్తున్నారు. వసతులు లేని అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుండటంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన మండలం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో పేరుకే నూతన మండలాలను ఏర్పాటు చేశారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తహసీల్దార్ కార్యాలయానికి ప్రతీనెల రూ.20 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఎనిమిదేళ్లలో సుమారు రూ.19 లక్షల అద్దె చెల్లించారు. మల్లన్న వసతి గదుల్లో పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతుండటంతో స్వామి వారి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు వసతి గదులు చాలక ఇబ్బందులుపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతన భవనాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలేకే ఇబ్బందులు

కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కావల్సిన ప్రభుత్వ భూమి లేకపోవడం వల్లే భవనాల నిర్మాణానికి అలస్యమవుతోంది. ఎవరైన దాతల స్థలం కేటాయిస్తే భవనాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీనారాయణ, తహసీల్దార్

ప్రతిపాదనలు పంపాం



మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి గతంలో పలుమార్లు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాము. త్వరలో ప్రభుత్వం కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నాం. – తలారి కీర్తన, ఎంపీపీ, కొమురవెల్లి

ఫిట్‌నెస్ లేని బస్సు నడిపితే కేసు

- ఎంవీఐ కొండల్ రావు



బస్సు పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ కొండల్ రావు

హుస్నాబాద్: ఫిట్‌నెస్ లేకుండా బస్సులను నడిపితే కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామని ఎంవీఐ కొండల్ రావు హెచ్చరించారు. హుస్నాబాద్ ఆర్టీఏ యూనిట్ కార్యాలయంలో గురువారం స్కూల్ బస్సుల రెన్యూవల్‌పై వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ ఆఫీస్ పరిధిలో 25 స్కూల్ బస్సులు ఉండగా, 22 బస్సుల ఫిట్‌నెస్ వెరిఫికేషన్ పూర్తి చేశామని, ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న మూడు బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించామన్నారు. స్కూల్స్ ప్రారంభానికి ముందే బస్సులు ఫిట్‌నెస్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి చేర్చే వరకు భద్రంగా తీసుకెళ్లాలని సూచించారు. యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే బస్సులను సీజ్ చేస్తామన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ సరైన పత్రాలతో పాటుగా బస్సులను కండిషన్‌లో పెట్టుకొని బస్సులు నడపాలన్నారు. కనీసం ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా డ్రైవర్ ప్రవర్తన, బస్సులు కండిషన్‌లో ఉన్నాయా లేవా అనేది చూసుకోవాలన్నారు. విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లదే అని అన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి



సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

హుస్నాబాద్: నీట్ పరీక్ష అవకతవకలపై ఈడీ, సీబీఐతో విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్ష 24 లక్షల మంది రాశారన్నారు. గ్రేస్ మార్కుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా 1530 మంది విద్యార్థులకు మార్కులు కలపడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులతో పరీక్ష పే చర్చ ద్వారా మాట్లాడే ప్రధాని మోదీ మౌనం వీడాలన్నారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నాయకులు ఉన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..

సిద్దిపేటకమాన్: నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ చౌరస్తాలో గురువారం నిరసన తెలిపారు. ఎన్‌టీఏ రద్దు చేసి ఆయా రాష్ట్రాలకు పరీక్ష నిర్వహించుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు రెండు ట్రిప్పులు నడపాలి



వినతిపత్రం ఇస్తున్న డీడీఎఫ్ ప్రతినిధులు

దుబ్బాక: దుబ్బాక నుంచి యాదగిరిగుట్టకు ప్రతీరోజూ రెండు ట్రిప్పులు బస్సు నడపాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం (డీడీఎఫ్) అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు గురువారం దుబ్బాక-యాదగిరిగుట్టకు రెండు ట్రిప్పులు నడపాలని, వేములవాడ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ బస్సుడిపో టీఐ లింగంగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దుబ్బాక నుంచి యాదగిరిగుట్టకు ఉదయం 5 గంటలకు బస్సును ప్రారంభించారని, మళ్లీ రెండో ట్రిప్పును దుబ్బాకకు రాకుండా సిద్దిపేట నుంచి నడిపిస్తున్నారన్నారు. దుబ్బాక నుంచి యాదగిరిగుట్ట మీదుగా స్వర్ణగిరికి రెండు ట్రిప్పులు నడిపే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దుబ్బాక-వేములవాడ బస్సును పునరుద్ధరించాలన్నారు. దుబ్బాక డిపోను పూర్తిస్థాయి డిపోగా చేయాలని, బస్సుల సంఖ్యపెంచి డీఎంతో పాటు పూర్తిస్థాయి స్టాఫ్‌ను నియమించి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ హనుమాన్‌నగర్ సబ్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ముర్షద్‌గడ్డ, సాయివిద్యానగర్, గణేష్‌నగర్, హనుమాన్‌నగర్, శ్రీసాయినగర్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

24 నుంచి శతచండీ హోమం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధి మోతె భువనేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 24 నుంచి 26 వరకు రాజశ్యామల హోమ సహిత మహారుద్ర పురస్సర శతచండీ హోమం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు గురువారం తెలిపారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాంద్రాల దామోదర్ గురువారం జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 60కి పైగా కంపెనీలు పాల్గొనున్నాయని, 500కుపైగా ఉద్యోగాల నియామకాలు చేపడతారన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బీనవేని రాకేష్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సనత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ మహిళా కమిషనర్‌పై చైర్మన్, పలువురు పాలకవర్గ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పరిచారని కాంగ్రెస్ కౌన్సిలర్లు శ్రీదేవి, బాల్‌లక్ష్మీ, రియాజ్, ఎంఐఎం కౌన్సిలర్ అర్షద్ ఆరోపించారు. గురువారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిల్ సమావేశం సందర్భంగా వేదికపై ఉన్న కమిషనర్‌ను కిందకు వెళ్లే విధంగా వ్యవహరించారన్నారు. కమిషనర్ తమకు అనుకూలంగా పనిచేయడం లేదని కౌన్సిల్ సభ్యులు ఏకపక్షంగా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిల్ పరిణామాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. త్వరలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్లు తెలిపారు.

తరగతి గదికి తాళం

నంగునూరు(సిద్దిపేట): మన ఊరు, మనబడి కార్యక్రమంలో మండలంలోని నర్మేట ప్రాథమిక పాఠశాలకు రెండు తరగతి గదులు మంజూరయ్యాయి. రూ.19 లక్షలు మంజూరు కాగా అప్పటి విద్యాకమిటీ చైర్మన్ మాంకాల నర్సింహులు తరగతి గదులు నిర్మించారు. ఎన్నికల కోడ్ రావడంతో గదులను పాఠశాలకు అప్పగించలేదు. నిర్మాణం పూర్తి చేసి సంవత్సరం గడిచినా బిల్లులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం గదులకు తాళం వేశాడు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ తనకు రూ.9 లక్షలు రావాలని అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఎంఈఓ యాదవరెడ్డికి ఫోన్‌లో తెలియజేసినట్లు చెప్పాడు.

నులి పురుగును నిర్మూలిద్దాం



చిన్నకోడూరులో విద్యార్థినికి నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సుగల వారు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, వైద్యురాలు సరిత, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే..

హుస్నాబాద్: పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ సాధ్యమని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నులిపురుగుల నివారణకు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ నిఖిత పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు..

మిరుదొడ్డి(దుబ్బాక): నులిపురుగుల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని ఎంపీపీ గజ్జెల సాయిలు కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

చిన్నారులకు..

తొగుట(దుబ్బాక): జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మీ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

దుబ్బాకటౌన్: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా దుబ్బాకలోని 18వ వార్డు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్‌తో కలిసి వేశారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సిద్దిపేటజోన్: జాతీయ నూలిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా గురువారం మున్సిపల్ చైర్మన్ మంజుల అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు వనిత, శైలజ, భవాని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అధికారులు చర్యలు తీసుకోవాలి**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో పనిచేస్తున్న విద్యుత్ లైన్‌మెన్‌లు రమేష్, కట్టర్ నర్సింహులు విధులు సక్రమంగా నిర్వహించడంలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని అయినాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అయినాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏఈ మధు అండతో విధులకు హాజరుకాకుండా ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తున్నరని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

◆ **క్రీడలతో మంచి భవిష్యత్తు**

కోహెడ(హుస్నాబాద్): గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి.రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో 15 రోజులుగా పీఆర్ఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో కొనసాగిన నియోజక వర్గ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలన్నారు. విన్నర్‌గా చిగురుమామిడి మండలం సుందరగిరి జట్టు, రన్నరప్‌గా కోహెడ జట్టు నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నరప్ జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీలు అందజేశారు.

◆ **పార్టీ నుంచి బహిష్కరణ**

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ మండలంలోని దాచారం గ్రామానికి చెందిన మ్యాకల నాగరాజును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆపార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి గురువారం తెలిపారు. నాయకుల ఫిర్యాదుల మేరకు తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

◆ **ప్రజలకు అందుబాటులో ఉండాలి**

సిద్దిపేటకమాన్: అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని 108 వాహనాల మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ అన్నారు. సిద్దిపేటలోని 108, 102 వాహనాలను జిల్లా మేనేజర్ వెంకటేష్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు.

◆ **విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అంతకు ముందు విద్యార్థులకు అల్బెండోజల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ శ్రీనివాస్, నంట శ్రీనివాస్‌రెడ్డి, ధరిపల్లి నగేష్, రఘురాజ్, వెంకటరమణ, సత్యనారాయణ, విజయభాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజిరెడ్డి**

సిద్దిపేటకమాన్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కూతురు రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 19, 20వ తేదీల్లో ఖమ్మంలో జరిగిన తృతీయ మహాసభల్లో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాజిరెడ్డి ఎన్నికపై ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలకుంట్ల రంగాచారి, పైడిపల్లి అరుణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

◆ **ప్రజా సంక్షేమం విస్మరించిన ప్రభుత్వం**

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని మాల మహానాడు రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య ఆరోపించారు. గురువారం బెజ్జంకిలో మాట్లాడుతూ సాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

◆ **ఫ్యాన్ల అందజేత**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంపీటీసీ సభ్యుడు లింగాల శ్రీనివాస్ తన సొంత ఖర్చుతో గురువారం రెండు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్స్, ట్యూబ్ లైట్స్ లేక పిల్లలు ఇబ్బందిపడుతున్నట్లు టీచర్లు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రూ.10 వేలతో ఫ్యాన్లు, లైట్లు కొనుగోలు చేసి కేంద్రాలకు అందజేశానన్నారు.

◆ **వారిపై వివక్ష చూపొద్దు**

బెజ్జంకి(సిద్దిపేట): వితంతువుల పట్ల వివక్ష చూపొద్దని బాల వికాస ప్రతినిధి అన్నామేరి అన్నారు. మండలంలోని దేవక్కపల్లెలో గురువారం బాలవికాస వితంతు వివక్ష విముక్తి ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధిరాతను ఎవరూ మార్చలేరని, భర్త మరణించిన మహిళలను చులకనగా చూడొద్దన్నారు. ఈనెల 23వ తేదీన అంతర్జాతీయ వితంతు దినం పురస్కరించుకుని మండలంలోని ప్రజలను చైతన్య పరచడానికి ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ **చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి**

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం పదో తరగతి పాసైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.10 వేలు, సమ్మక్క, సారక్క గిరిజన గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా గూడెం, తండాలకు రూ.25 లక్షలు వెంటనే ఇవ్వాలన్నారు.

◆ **ఎంపీని కలిసిన మాజీ సర్పంచ్**

తొగుట(దుబ్బాక): మెదక్ ఎంపీ రఘునందన్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు మండలంలోని చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింహులు తెలిపారు. మండల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకుపోగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

◆ **చెరువు మట్టిని అనుమతించాలి**

కోహెడ(హుస్నాబాద్): పొలాల్లో చల్లుకునేందుకు చెరువు మట్టిని అనుమతించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అధికారులను కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ భూసారం పెంపునకు చెరువు మట్టి అవసరమని, ఇందుకు రెవెన్యూ అధికారులు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి అడ్మిషన్లపై అవగాహన**

మిరుదొడ్డి(దుబ్బాక): 2024–25 విద్యా సంవత్సరానికి మేడ్చల్ జిల్లా హకీం పేట స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసేవిధానంపై అవగాహన కల్పిస్తామని ఎంఈఓ జోగు ప్రభుదాసు గురువారం తెలిపారు. ఎలా దరఖాస్తు చేయాలి, ఎత్తు, బరువు, 30 మీటర్స్ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండిగ్ బోర్డు జంప్, 800 మీటర్ల పరుగు, షటిల్ రన్, మెడికల్, ఫిజికల్ టెస్టులు, రూల్స్ తదితర అంశాలు తల్లిదండ్రులకు వివరిస్తామన్నారు. 21, 22వ తేదీ సాయంత్రం 4లోగా మండల వనరుల కేంద్రంలో సంప్రదించాలన్నారు.

◆ **విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల పవన్‌కుమార్ అన్నారు. గురువారం ఏబీవీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే నిబంధనలు ఉన్నా ఇప్పటి వరకు అమలు కావడంలేదన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 24 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990